# నాగరాజు

అనగా అనగా ఆంధ్రదేశంలో పినాకినీ తీరాన్న, సింహపురి పెరుమాళ్ళ దేవాలయ మండపంలో ప్రతి సాయంత్రం చిఱుమబ్బులన్నీ కరిగిపోయే దివ్యవీణాగానం వినిపించేది. దేశ దేశాల్నుంచి ఆ అమృత స్వరాలు వినేటందుకు వృద్ధులు, యువకులు, నవతుషార పరిమళగాత్రులు, అంతా వచ్చి పులకరాలతో తన్మయత్వం పొందేవారలు. మండపంలోనూ మెట్ల మీదను రంగురంగుల వస్త్రాలతో వెన్నెట్లో విరగబడే సముద్రపు కెరటాల్లా చిత్రమైపోయేవారు. కొన్ని నయనాలు నిమీలితములై పాడ్యమినాటి చంద్రవంకలా చెమరించేవి. విస్ఫారిత నయనాలు కొన్ని చైతన్యం వదలి బంగారు కిరణాలనీటిలో మఱచి విహరించే చేపలరీతిగా తళుకులాడేవి.

ఆ మండపం మీద సౌందర్యం ముద్దపోసిన ఓ యోవనుడు దంతం, మంచిగంధం తీగెలు సాగిన వీణ మేళవించి, గౌరీశంకర శృంగంపై మంచు మరిగే విమల గాంధర్వం జగన్మోహనం చేసేవాడు. బంగారం ఒరిసే ఒళ్ళు, తెలుగు పల్లవుల వేంగీపురం – ఏనుగుల కుంభస్థలాల్లాంటి భుజాలు, పర్వత సానువువంటి వెడదరొమ్ము, నల్లటి ఉంగరాల జుట్టు, చిలక ముక్కు, విశాలమైన ఫాలం, ఆ పడుచు పాటగాడు, వీణ – వయ్యారంగా పల్లెవాటు వేసుకొని, చిక్కుడు కాయల్లాంటి వేళ్ళతో తీగెలు సవరించి, మెట్లు నొక్కుతూ వీణపాడుతుంటే, పేరు పొందిన గాయకులు, వైణికులు, వినటానికి వచ్చి, దినం దినం ఆ పట్టణంలోనే నిల్చిపోయేవారు.

సహజ సంగీత రసోద్రేకంకల యువజనులు అతని పాటలు విని, ఆయన్ని గురువుగా యెంచుకొని, ఆ మోస్తరుగా వీణెలు మేళవించి, ఇళ్ళ దగ్గర సంగీతం నేర్చుకుంటూ ఉండేవారు.

అక్కడికి ఒక పరాయి దేశంమనిషి వచ్చి భయంకరంగా ఆకర్షించే కెంపుకళ్ళతో, ఊగిపోతూ పాట వినేవాడు. అతని ఆకుపచ్చని తళుకుపంచె కూడా ఆ సంగీతం వినేటట్లే కనపడేది.

## 2

ఒక సంధ్యాకాలంలో – ఆ వీణాధరుడు హాయిమను కొత్త పాట ఒకటి మోహనమైన గాత్రంకలిపి తీగెలపై ప్రయోగించినాడు. సభ్యులందరూ పరవశులై పోయినారు.

చిరునవ్వుతో ఆ పాటకాడు అందరినీ చూచి, పరాయిదేశం మనిషిపై చూపు నిలిపి, 'ఓ నాగరాజా! నే పాడే ఈ నూత్న ఫణితులలో అపశ్రుతి ఏ మాత్రం కలిగినా, ఈ నా కుడిచెయ్యిపై కాటేసి, నన్ను దహింపవలసింది' అని అడిగాడు. గుండెలు పగిలే పామునవ్వులో ఆ పరాయిదేశం మనిషి లేదన్నట్లు తల తిప్పాడు. ఒక్క నిమేషం నిర్మల నీలాకాశంవైపు చూపులు పోనిచ్చి కన్నులరమూతలుపడగా, స్ఫటికంలాంటి చెక్క వీణాదండాని కానించి, ఒక్క విచిత్రరాగం ఆలాపంచేశాడా బాలమూర్తి. కొండ పొలాల్లో పరుగులెత్తే వాగుల పాటలు నిశ్శబ్దంలోంచి బయలుదేరినై. ఉదయం మంచుగుళికలు చెట్ల లేత జిగురు ఆకులనుండి క్రింద సెలయేటి నీటిలో తాళంరీతి పడి మారుమ్రోగాయి. వృక్షముల గానమైనది. సంధ్యా రాగాలలో జీరలు పోయి, తీగెలు సాగి, పలవలై తలపుల కలుములైనది. గంభీర సముద్ర వీచికల హోరైంది. కథల పాడింది. ఋక్కులై ఘన రాగమైపోయింది. సర్వమహామండలాలు ఊగించి, ఒక్కమారాగి, తళుక్కున తారాలోకమై మాయమైంది ఆ పాట.

## 3

**ఈ** గానాలసుడిలో తన్మయుడైపోయి, ఆ పరాయిదేశం మనిషి కన్నులే చెవిగా విన్నాడు. ఇటు నటు తాండవించిపోయాడు.

ఆ సమయంలో, అతని శిరస్సు వెనక మూడు సర్ప శిరస్సులు బయలుదేరాయి. ఆ తలల్లో మణికిరీటాలు పొడసూపినై.

ఆ సమూహంలోంచి ఆజానుబాహుడైన ఒక వృద్ధ తపసి లేచాడు. అతని జడలు పాలసముద్రం ప్రవాహాలైనై. అతని పొడుగాటి గడ్డం వెన్నెల్లో ప్రయాణంచేసే తెల్లని మబ్బయింది. మహాసత్వం తెలిపే తీక్షణ దృష్టితో ఆ పడుచుపాటకుని చూచి 'అబ్బాయీ! కొన్ని ముహూర్తాల క్రితం నీ పాటలో అపశ్రుతి దోషముందా? మహదానందానికి లోపం ఉందా? అని కళాపశ్రుతి దోష శిక్షారూప మూర్తియైన ఈ పాములరాజు నడిగావు' అని పరాయి దేశం మనిషిని చూచి, "ఓ నాగరాజా! ఈ గానగర్వి సంగీతములో అతులిత దివ్యానందం ఏ ప్రక్కనుంచి వస్తుంది? పూర్వ సంప్రదాయాలన్నీ త్యజించి, హేయమైన నూత్న ఫక్కీలో సృజించాడు. గాంధర్వస్మృతి దోషుడయిన ఇతనికి మరణమే శిక్ష" అని ఊరుకొన్నాడు.

ఆ మాటల కంతా హాహాకారం చేశారు. ఆ పరాయి దేశం మనిషి వణికిపోయాడు. దీనంగా అతనికేసి చూశాడు. తల వాల్చి ఒక నిమేషం ఆలోచించాడు. బుస్సుమని నిట్టూర్పు పుచ్చాడు. ఇంతలో ఆ పరాయిదేశం మనిషి క్రోధమూర్తి అయ్యాడు. చూస్తుండగా, అతడు కరిగిపోయాడు, దేహమంతా, తళుకు తళుకుల పొడలున్న సర్పదేహమయింది. మనిషితల మాయమయింది.

ఎఱ్ఱజీరల నాలుకల ఆడిస్తూ మూడుఫణాలు ఛత్రా లయ్యేటట్లు ఆడిపోయినవి.

## 4

తేజస్సునిండిన మోములో చిరునవ్వులు తాండవించగా, ఆ బాలకుడు కాటుకై సూర్యకిరణంలాంటి తన చేయి ముందుకు చాపాడు. ఆరు ధనువుల పొడవై దేహం ఆడి చుట్టలు చుట్టుకొంటూండగా బుస్సుమని, ఆ నాగరాజు పడగలు వెనకకు పోనిచ్చి, మెరుపులా కాటువేయపోయే చిటికలో లోకాలు కదిపే తీగ పాటలస్వనంలో "ఆగు" అని మాటలు వినపడ్డాయి. ఆ మండపంమీద ఒక స్తంభాన్ని ఆనుకొని దినదినమూ పాట వినడానికి వచ్చే ఒక బాలిక దివ్య సౌందర్యగాత్ర పద్మంలాంటి చెయ్యి చాపి, నాగరాజును ఆగుమని సన్నచేసింది. శృతులన్నీ మురిసిపోయే చూపులతో ఆ తపసిని చూచి, ఓ పూర్వ సంప్రదాయీ, ఈ కుమారుని నూతన సంప్రదాయము నీ పూర్వసంప్రదాయమున కపశ్రుతి తీసికొని రాలేదు. ఇతని కొత్తపోకడలు అద్భుతానందం ఇస్తున్నవి. నీ పూర్వసంప్రదాయమంతా అనేక యుగాలలో, అనేక కళామూర్తుల కొత్త ఫక్కీలతో నిండివున్నవే, వెనుకటి మార్గములకే మాత్రము అపశ్రుతిరాని కొత్తదారులు ఉత్క్రుష్టమైనవి. అనేక సంప్రదాయకర్తలవలె ఈ నూతన సంప్రదాయాని కితడు మూల పురుషుడు. కళాధిదేవికి ఆనందాత్మయైన నా కిత డీ నూతన కుసుమం అర్పించాడు. అది ప్రేమతో అంగీకరిస్తున్నాను' అని ఆమె వీణాపల్లవ పాణియై వెలుగుల అంతర్హిత అయిపోయింది.

"ఓ కళాకుమారా! నువ్వు ధన్యమూర్తివి. నీ పాటలు లోకంలో వెదజల్లు నీ దివ్యగీతికానాదం ప్రణయాలు గురియైనది జోలల్లో పాపల నూపనియ్. అనంత సత్యాల అవతరింపనియ్." అని తపసి ఎక్కడికో పోయాడు. ఆ పరాయిదేశం మనిషి, ఇంతలో మాయమైపోయాడు.